


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 01-04-2026 | సంపుటి - 27 | సంచిక -309 | రూ : 4 | పేజీలు: 8


## మూసీ ముఖచిత్రం మార్చేలా అడుగులు

# సబ్ కమిటీ కీలక నిర్ణయాలివే..

- సమావేశమైన సబ్ కమిటీ సభ్యులు మల్లు భట్టివిక్రమార్క, పొన్నం ప్రభాకర్
- మూసీ పునరుజ్జీవంపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయం
- ఏప్రిల్ 15వ తేదీ వరకు అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయం

2లో



## వారసత్వ సంపదతోనే శాంతి సాధ్యం

- గాంధీనగర్‌లో సమ్రాట్ సంప్రతి మ్యూజియంను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే సమాధానమని వ్యాఖ్య
- వేల ఏళ్ల నాటి జైన కళాఖండాలు, పురాణాలకు నిలయంగా మ్యూజియం
- ఇది కేవలం మ్యూజియం కాదు, సాంస్కృతిక ఆరాధన కేంద్రమన్న ప్రధాని

2లో



## దద్దరిల్లిన ఇస్ఫహాన్

- ఇరాన్‌లో అణుకేంద్రం, ఆయుధ నిల్వలున్న ప్రాంతంపై బంకర్ బస్టర్లతో విరుచుకుపడిన అమెరికా
- కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ ప్రతి దాడి
- మరింత ఉగ్రరూపం దాల్చిన పశ్చిమాసియా
- శాంతి ప్రణాళిక రూపొందించిన చైనా, పాక్

దుబాయ్: పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఇరాన్ ప్రధాన అణుక్షేత్రాలున్న ఇస్ఫహాన్‌పై అమెరికా మంగళవారం భారీగా దాడులు చేసింది. దీంతో ఆకాశంలో భారీ అగ్నిగోళం కనిపించింది. ఇస్ఫహాన్‌లో ఆయుధ నిల్వలున్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్‌లతో అగ్రరాజ్యం దాడి చేసింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అటు పర్షియన్ గల్ఫ్‌లో కువైట్ తరువాయి 2లో



## తెలంగాణలో ఐదు రోజుల పాటు

### ఉరుములు, మెరుపులతో కూడిన వానలు

*ధాన్యం రాశులపై జాగ్రత్త వహించాలన్న వాతావరణ శాఖ.*



2లో



2లో

## అప్పుల హస్తం..

# సామాన్యుడిపై భారం!


- రోజువారీ ఖర్చుల కోసం ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితి
- కాగ్ నివేదికతో కాంగ్రెస్ ఆర్థిక విధ్వంసం బట్టబయలైంది

## స్పెయిన్ బాటలోనే..

### అమెరికాకు షాకిచ్చిన ఇటలీ

- తమ వైమానిక స్థావరాల్లో అమెరికా సైనిక విమానాలకు అనుమతి నిరాకరణ
- సిసిలీలోని గోనెల్లా వైమానిక స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి ఇటలీ నో
- తమ బాంబర్ విమానాలు నిలపడానికి అమెరికా అనుమతి కోరినట్లు వార్తలు

2లో



## క్వాంటం ఆంధ్ర:

# టెక్నాలజీ రేసులో ఏపీ నంబర్ వన్!

- 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి లక్ష్యం
- ఏప్రిల్ 14న అమరావతిలో దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ ప్రారంభం
- 2030 నాటికి గ్లోబల్ క్వాంటం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దేలా ప్రణాళిక
- క్వాంటం హార్డ్ వేర్ తయారీ ఎకోసిస్టంపై సీఎం చంద్రబాబు కీలక రౌండ్ టేబుల్ సమావేశం

2లో




# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ



- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధం
- ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత కరువు
- దిశానిర్దేశం లేకుండా ముగిసిన అసెంబ్లీ సమావేశాలు
- రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలి
- పొంగులేటి అవినీతిని బయటపెట్టినందుకే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్ : మాజీమంత్రి హరీశ్‌రావు

2లో

## స్పెయిన్ బాటలోనే...
# అమెరికాకు షాకిచ్చిన ఇటలీ

ఇటలీ : తమ వైమానిక స్థావరాల్లో అమెరికా సైనిక విమానాలు దిగడానికి ఇటలీ అనుమతి నిరాకరించింది. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఇప్పటికే స్పెయిన్ అమెరికాకు షాకిచ్చింది. యుద్ధంలో పాలుపంచుకునే విమానాలను తమ గగనతలంలోకి అనుమతించబోమని స్పెయిన్ ప్రకటించింది. తాజాగా, ఇటలీ కూడా అదే దారిలో నడుస్తోంది. అమెరికాకు తమ గగనతలాన్ని మూసివేయాలని ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సిసిలీలోని సిగోనెల్లా వైమానిక స్థావరాన్ని అమెరికా యుద్ధ విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో తమ బాంబర్ విమానాలను నిలపడానికి అమెరికా ఇటలీ అనుమతి కోరినట్లు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటలీ అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

# అప్పుల హస్తం..సామాన్యుడిపై భారం!

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చులకు ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితిలోకి రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టేసిందన్నారు. కాగ్ 202425 నివేదికలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెల్లడించిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు "సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం" అని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చులకు కూడా కూడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద చేయి చాచాల్సిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రెండు రోజులు మినహా మిగతా అన్ని రోజులు ఆర్బీఐ నుంచి చేబదులుగా డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని నెట్టుకురావడం సిగ్గుచేటని అన్నారు. ఏడాది కాలంలో రూ.1.30 లక్షల కోట్లు చేబదులు అప్పులు తెచ్చి సర్కారును నడిపించటమంటే కచ్చితంగా అది చేతకాని తనమేనని విమర్శించారు. తెచ్చిన అప్పుల్లో మరో 6 వేల కోట్లు ఆర్థిక సంవత్సరం ముగిసినా చెల్లించలేదనే విషయాన్ని కాగ్ బట్టబయలు చేసిందన్నారు. నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్న తెలంగాణలో రోజువారీ కనీస అవసరాల కోసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటెన్ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.

**సంపద పెంచటంలో విఫలం**

ఎన్నికలకు ముందు సంపద పెంచుతాం.. పేదలకు పంచుతామని కాంగ్రెస్ నాయకులు పెద్ద, పెద్ద మాటలు చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద పెంచటం మాట అటుంచితే కేవలం అప్పులతోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఇప్పటికే అడ్డగోలుగా రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు చేసి, రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పు భారాన్ని మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి ఆర్థిక సంక్షోభంలో కూడా ఇంకా "మిగులు బడ్జెట్" అని చెప్పుకుంటూ తెలంగాణ ప్రజలను పచ్చి దగా చేస్తున్నారంటూ మండిపడ్డారు. కాగ్ నివేదికతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక విధ్వంసం బట్ట బయలైందన్నారు. ఇకనైనా ప్రచార ఆర్భాటాలు బంద్ చేసి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

*** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో అకాల వర్షాల కారణంగా చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. వందలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, మామిడి కాయలు నేలరాలాయని తెలిపారు. నువ్వులు, పసుపు, వరి పంటలకు తీరని నష్టం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా రైతుల కష్టం అంతా నేల పాలైందని విచారం వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# దద్దరిల్లిన ఇస్ఫహాన్

దుబాయ్ : పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఇరాన్ ప్రధాన అణుక్షేత్రాలున్న ఇస్ఫహాన్‌పై అమెరికా మంగళవారం భారీగా దాడులు చేసింది. దీంతో ఆకాశంలో భారీ అగ్నిగోళం కనిపించింది. ఇస్ఫహాన్‌లో ఆయుధ నిల్వలున్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్‌లతో అగ్రరాజ్యం దాడి చేసింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అటు పర్షియన్ గల్ఫ్‌లో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడికి పాల్పడింది. తమకు సహకరించని దేశాలు సొంతంగా చమురు ఏర్పాట్లు చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూంకరించారు. మరోపక్క కాస్త ముందుగానే యుద్ధాన్ని ఆయన ఆపేస్తారని సంకేతాలు వెలువడుతున్నాయి. తాజా దాడి వీడియోను 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టు చేశారు. మరోవైపు పశ్చిమాసియాలో శాంతికి వీలుగా దాడుల్ని తక్షణం ఆపాలని చైనా, పాకిస్థాన్ ప్రతిపాదించాయి.

**అగ్రరాజ్యానికి షాకిస్తున్న దేశాలు**

ఇరాన్‌పై యుద్ధం కొనసాగిస్తోన్న అమెరికాకు కొన్ని దేశాలు షాక్ ఇస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేయడానికి ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రసార మాధ్యమాలు వెల్లడించాయి. ఇటీవల స్పెయిన్ సైతం ఇదే తరహా ప్రకటన చేసింది. ఇరాన్‌పై దాడుల్లో జోక్యం చేసుకోవడానికి ఈయూ దేశాలు ఇష్టపడటం లేదు. సిసిలీలోని తమ కీలక వైమానిక స్థావరాన్ని అమెరికా విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో బాంబర్ విమానాలను నిలపడానికి ఇటలీ అనుమతిని అమెరికా కోరినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి.

**హర్మూజ్ తెరవకుండానే యుద్ధ ముగింపునకు ట్రంప్ సిద్ధం!**

ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనాన్ని ప్రచురించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తిరిగి తెరవకపోయినా, ప్రస్తుత సైనిక చర్యలను ముగించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని అమెరికా అధికారుల్ని ఉటంకిస్తూ వెల్లడించింది.

# వారసత్వ సంపదతోనే శాంతి సాధ్యం...

ఢిల్లీ : ప్రపంచం అస్థిరత్వంతో సతమతమవుతూ, అశాంతి జ్వాలలతో దహించుకుపోతున్న క్లిష్ట సమయంలో సాంస్కృతిక వారసత్వమే మానవాళికి మార్గం చూపుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇవాళ మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లోని కోబా తీర్థ్‌లో ఏర్పాటు చేసిన 'సమ్రాట్ సంప్రతి మ్యూజియం'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మ్యూజియం ఇచ్చే సందేశం కేవలం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని అన్నారు. అశోక చక్రవర్తి మనవడు, అహింసా మార్గాన్ని ప్రచారం చేసిన సమ్రాట్ సంప్రతి పేరుతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సేకరించిన జైన సమాజానికి చెందిన అమూల్యమైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని 1000 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావడం విశేషం. దశాబ్దాల పాటు తమ జీవితాలను అంకితం చేసి, భారతదేశం, నేపాల్ నుంచి ఈ కళాఖండాలను సేకరించిన జైన సన్యాసి ఆచార్య పద్మసాగర్ సూరీశ్వర్జీ సేవలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ మ్యూజియం కేవలం కళాఖండాల భాండాగారం మాత్రమే కాదని, ఇది జైన ఆరాధనకు, సంస్కృతికి, వారసత్వ పరిరక్షణకు ఒక శక్తిమంతమైన కేంద్రమని ప్రధాని మోదీ అభివర్ణించారు. కోబా తీర్థ్ ఎంతో కాలంగా శాంతికి, ఆధ్యాత్మిక సాధనకు నెలవుగా ఉందని గుర్తుచేశారు. ఈ మ్యూజియం రూపకల్పనలో వేదాలు, పురాణాలు, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని, ఇది మన భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ కేంద్రాన్ని పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యూజియంలో జైన తత్వశాస్త్రం, తీర్థంకరుల జీవితాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, ఆలయ నమూనాలు, చారిత్రక కళాఖండాలతో కూడిన ఏడు గ్యాలరీలు ఉన్నాయి. సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియోవిజువల్ టెక్నాలజీని మేళవించి సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నారు.

*** 'వికాస్ భీ, విరాసత్ భీ'కి ఇది నిదర్శనమన్న గుజరాత్ ప్రభుత్వం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఈ మ్యూజియం సాంస్కృతిక పరిరక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ మాట్లాడుతూ.. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం రెండూ) అనే ప్రభుత్వ దార్శనికతకు ఈ మ్యూజియం నిదర్శనమని, ప్రధాని చేతుల మీదుగా ఇది ప్రారంభం కావడం జైన సమాజానికి గర్వకారణమని తెలిపారు.

# తెలంగాణలో ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో వానలు


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో రైతులకు శిక్ష వేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద ద్వేషం ఉంటే తమకు శిక్ష వేయాలనీ, రైతుల పొట్ట కొట్టొద్దని కోరారు. తక్షణమే నిధులను విడుదల చేసి కాలువలకు నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన వ్యాఖ్యలు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయనీ, బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.90 వేల కోట్లు, రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులిచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని వివరించారు. భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువలకు వెళ్లి నీళ్లు వదులుతున్నారనీ, అవి కాళేశ్వరం నీళ్లు కావా?అని ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారనీ, అది కాళేశ్వరంలో భాగం కాదా? అని అడిగారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళ్లు తేవడం కోసం రూ.ఎనిమిది వేల కోట్లతో కాలువలు తవ్వుతున్నారనీ, మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ వెళ్లి సాగునీటిని, పంటలను చూద్దామనీ, నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో రైతులను అడుగుదామని కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. రూ.50 కోట్లు విడుదల చేస్తే కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులివ్వకుండా పగబట్టిందని విమర్శించారు.

**తూతూమంత్రంగా అసెంబ్లీ**

దిశా నిర్దేశం లేకుండా తూతూమంత్రంగా అసెంబ్లీ సమావేశాలు ముగిశాయని హరీశ్‌రావు అన్నారు. ఆరు గ్యారెంటీలపై స్పష్టత కరువైందని చెప్పారు. ప్రజా సమస్యలపై చర్చకు పారిపోయి, కేరళ ఎన్నికల కోసం అసెంబ్లీని అర్ధాంతరంగా ముగించారని విమర్శించారు. మంత్రి పొంగులేటి అవినీతిని ఆధారాలతో బయటపెడితే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారని అన్నారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాడిన అహంకారపూరిత, వీధి రౌడీల భాషను ఎథిక్స్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల పక్షాన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసిందని చెప్పారు. తమకు శాసనసభ మాత్రమే వేదిక కాదనీ, ప్రజాక్షేత్రంలో అన్ని వేదికలపైనా ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, విజయుడు, బి లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



## మూసీ ముఖచిత్రం మార్చేలా అడుగులు
# సబ్ కమిటీ కీలక నిర్ణయాలివే..

హైదరాబాద్ : మూసీ నది పునరుజ్జీవంపై తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పనులను ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం మూసీ పునరుజ్జీవంపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నట్లు తెలిపింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కూడిన సబ్ కమిటీ, సంబంధిత అధికారులతో ఈరోజు సమావేశమైంది. మార్చి 31వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఏప్రిల్ 15వ తేదీ వరకు తమ అభిప్రాయలను, సూచనలను నేరుగా musirrdc@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

# కరీంనగర్ జిల్లా హత్య కేసులో 15 మందికి జీవిత ఖైదు

కరీంనగర్ : ఒక వ్యక్తి హత్య కేసులో 15 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ తీర్పు వెలువరించారు. మరో నిందితుడు మైనర్ కావడంతో అతడిపై బాలనేరస్థుల న్యాయస్థానంలో విచారణకు అనుమతించింది. చేపలు పట్టే విషయంలో ఏడేళ్ల క్రితం జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది. కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన బొజ్జ తిరుపతి గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చెరువుల వివాదంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు అతడిని హత్య చేశారు. రాళ్లతో దాడి చేసి, కండువాను మెడకు బిగించి హతమార్చారు. ఈ ఘటన 2019 ఏప్రిల్ 19న జరిగింది. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం 15 మంది నిందితులకు జీవితఖైదుతో పాటు రూ.1,500 చొప్పున జరిమానా విధించింది.

# క్వాంటం ఆంధ్ర : టెక్నాలజీ రేసులో ఏపీ నంబర్ వన్!

అమరావతి: క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల ద్వారా లభించే ప్రయోజనాలను దేశంలోనే తొలిగా అందుకునేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తు సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడం ద్వారా రాష్ట్రానికి అపార అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ), దేశానికే ప్రగతి ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కీలక సమావేశానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీతో పాటు సీడాక్, సీడాట్, డీఆర్‌డీవో, బార్క్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఐటీని అందిపుచ్చుకుని హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా మార్చిన స్ఫూర్తితో, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని ఏపీ అభివృద్ధికి చోదకశక్తిగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీ నిపుణుల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లే, ఇప్పుడు క్వాంటం నిపుణులను తీర్చిదిద్దేందుకు వైసర్, ఐబీఎం వంటి సంస్థల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం రాబోయే రెండేళ్లలో 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం హార్డ్ వేర్, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ వంటివాటిని దిగుమతి చేసుకోకుండా, అమరావతి క్వాంటం వ్యాలీలోనే దేశీయంగా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. 2030 నాటికి ప్రపంచంలోని 5 గ్లోబల్ క్వాంటం హబ్స్‌లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హార్డ్ వేర్ ఎకోసిస్టంను ఏక్యూవీలో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు స్టార్టప్‌లు, పరిశోధనలకు అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రణాళికలో భాగంగా, దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్‌ను ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెస్టింగ్ కోసం ఈ కంప్యూటర్ అందుబాటులో ఉంటుందని వారు వివరించారు. క్వాంటం టెక్నాలజీతో అమరావతి భవిష్యత్ నగరంగా, అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర లక్ష్య సాధనకు అవసరమైన సాంకేతికత, భాగస్వామ్యం అందించాలని జాతీయ క్వాంటం మిషన్‌ను ఆయన కోరారు.

## ఎన్జీ కళాశాలలో ఏప్రిల్ 2న మెగా జాబ్ మేళా

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నాగార్జున ప్రభుత్వ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ డ్రైవ్ - 2026 ను ఏప్రిల్ 02 న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. ఎస్. ఉపేందర్ టి ఎస్ కే సి కోఆర్డినేటర్ డా. ఎం. అనిల్ కుమార్ లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. కళాశాల సెమినార్ హాల్లో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ డ్రైవ్లో 10కు పైగా ప్రముఖ కంపెనీలు కొన్ని బహుళజాతి సంస్థలు పాల్గొని, అభ్యర్థులకు 700కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, బి.ఫార్మసీ, ఎంబిఏ, ఎంసీఏ మరియు ఇతర అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ డ్రైవ్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నియామకాల ద్వారా కస్టమర్ సపోర్ట్, ఇంటర్నేషనల్ చాట్, వాయిస్ ప్రాసెస్, హెచ్ఆర్ ఉద్యోగాలు, టెలీకాలర్ ఉద్యోగాలు, ఫార్మసీ సంబంధిత ఉద్యోగాలు, లోకల్ జాబ్స్ మరియు వర్క్ ఫ్రం హోమ్ అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. పాల్గొనదలచిన అభ్యర్థులు తమ బయోడేటా ప్రతులు, విద్యార్హత సర్టిఫికెట్లు , గుర్తింపు పత్రం తీసుకొని రావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9553141962, 8790535238, 9494559027, 7997406727 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించవలసినది కోరారు.

## యుద్ధాలు ప్రపంచశాంతికి పెనుప్రమాదం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారుతోందని, ఈ యుద్ధం భారీ ప్రాణ నష్టానికి, ప్రాంతీయ అస్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నానికి దారితీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ఇరాన్పై ఏకపక్ష యుద్ధం చేస్తున్నాయని, దీని వల్ల అమయాకులు సమిదలవుతున్నారని, సుమారు 3300 మందిని పొట్టన పెట్టుకున్నారని, పసి పిల్లలను కూడా వదల్లేదని మండిపడ్డారు. భారతదేశ నౌకాదళం పై దాడి జరిగినప్పటికీ, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోడి కనీసం నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదని స్పష్టం చేశారు. జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావు, మిరియాల రంగయ్య, కుట్టడం కార్పొరేషన్ మేయర్ మోడ్ గణేష్'తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్ది సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్ కే ఫహీం, డి శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఐఎఫ్టీయూ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని, బలవంతంగా ఏప్రిల్ 1వ నుంచి అమలు చేయాలనే ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు బ్లాక్ డే నిరసన ధర్నా చేపట్టనున్నట్లు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) రాష్ట్ర నాయకులు గౌరీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక రైటర్ బస్తి కార్యాలయంలో జరిగిన కొత్తగూడెం ఏరియా కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పాత చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కోడ్లను తీసుకురావడం అంటేనే మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తీసుకురావడం అని ఆయన అన్నారు. అన్ని కార్మిక సంఘాలు బ్లాక్ డేలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోత్కూరి మల్లికార్జునరావు, సంజు, రాధ, కరుణ, రాజేశ్వరి, శరత్, అవినాష్, నాగలక్ష్మి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## అంకెల గారడీగా కార్పొరేషన్ బడ్జెట్: సిపిఎం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కార్పొరేషన్ బడ్జెట్ రూపకల్పన కాలేదని సిపిఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో బడ్జెట్ను అంకెల గారడీగా ఆయన అభివర్ణించారు. కాగితాలపైనే పరిమితమైన ఈ బడ్జెట్ కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. నగర అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.107 కోట్ల ఆదాయం మాత్రమే సాధ్యమయ్యే పరిస్థితిలో, రూ.140 కోట్లతో బడ్జెట్ రూపొందించడం ప్రజలను తప్పుదారి పట్టించే చర్యగా పేర్కొన్నారు. కోతులు, కుక్కల సమస్యల వంటి ప్రజల రోజువారీ ఇబ్బందులకు బడ్జెట్ లో ప్రాధాన్యం ఇవ్వకపోవడం పాలకవర్గం నిర్లక్ష్యాన్ని సూచిస్తుందన్నారు. బడ్జెట్ రూపకల్పనలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. కార్పొరేషన్ స్థాయి జీతాలు ఇవ్వాలని కోరినా, బడ్జెట్ లో ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా నిధుల వినియోగం జరిగేలా బడ్జెట్ను పునర్విమర్శించాలని బాలరాజు కోరారు.

# వికారాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్

వికారాబాద్ ప్రజాస్ఫూర్తి : వికారాబాద్ జిల్లా కరణ్కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిసిఐ ఫ్యాక్టరీలో భారీ ఉచిత కంటి వైద్య శిబిరం, డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలనలో భాగంగా, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహన చోదకుల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు బాగున్నప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టగలమని పేర్కొన్నారు. డ్రైవర్ల అలసట, దృష్టిలోపం వల్లే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. అలాగే, డ్రగ్స్ మహమ్మారి యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తోందని, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని, అనుమానిత సమాచారాన్ని వెంటనే అధికారులకు అందించాలని కోరారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. రహదారి భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. కంటి సమస్యలున్న డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డీఎస్పీ నర్సింగ్ యాదయ్య,కరణ్ కోట్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్.ఐ వినోద్ రాథోడ్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సర్పంచ్ రాజ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, సీసీఐ జనరల్ మేనేజర్ సరోజ, ఇతర పోలీస్ అధికారులు, సిసిఐ అధికారులు పాల్గొన్నారు.



## బివిఆర్ ఐటి లో మొదలైన సినర్జియా 2026 వేడుకలు




కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : బివిఆర్ ఐటి హైదరాబాద్ బాచుపల్లి మహిళా కళాశాల ఆవరణలో సినర్జియా 2026 వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 60 కళాశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు సాగనున్న సినర్జియా కార్యక్రమంలో మొదటి రోజు సాంకేతిక కార్యక్రమాలు, రెండవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, మూడవ రోజు వార్షికోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మొదటి రోజు సాంకేతిక విభాగంలో కోడింగ్ పోటీలు, ప్రాజెక్టు ప్రదర్శనలు, పేపర్ ప్రెజెంటేషన్స్, సాంకేతిక క్విజ్లు, డిజైన్ చాలెంజ్లు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యార్థి వ్యవహారాల మండలి అధ్యక్షురాలు ఇట్టా సరహా మాట్లాడుతూ సినర్జియా ఉత్సవాల వల్ల విద్యార్థుల ఆవిష్కరణలు, సృజనాత్మకత, పరస్పర సహకారానికి ఇది వేదిక అవుతుందని అన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమన్వయ నైపుణ్యాలు అత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి ఎన్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు చురుకుగా పాల్గొని తమలోని ప్రతిభను వెలికితీయాలని సూచించారు. కొత్తవిషయాలను నేర్చుకోవాలని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో లాయడ్ టెక్నాలజీ సెంటర్ ఇంజనీరింగ్ హెడ్ హిమ బిందు వెలిజాల, సాంస్కృతిక విభాగాధిపతి కె.వర్ష, సమన్వయకర్త డాక్టర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సు పథకం మహిళల స్వావలంబనకు భరోసా

*** జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఉచిత బస్సు పథకం మహిళల ఆర్థిక, సామాజిక భద్రతకు, స్వావలంబనకు భరోసా, బలమైన అడుగు అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం నల్గొండ ఆర్టీసీ బస్టాండ్ లో మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సులో పదివేల కోట్ల ఆదా చేసిన సందర్భంగా ప్రయాణించిన మహిళలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే సుమారు రూ.340 కోట్ల వరకు ఆదా జరగడం విశేషమని అన్నారు. ఈ పథకం వల్ల మహిళలు తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుని ఆ డబ్బును కుటుంబ అవసరాలు, విద్య, ఆరోగ్యంపైవినియోగిస్తున్నారని కలెక్టర్ వివరించారు. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని, మహిళా రైతులకు రైతు బీమా, పింఛన్లు వంటి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. త్వరలో అమలు కానున్న ఇందిరమ్మ బీమా పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం వల్ల మహిళలు నెలకు సగటున రూ.5,000 వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ఆర్టీసీ సదుపాయాల మెరుగుదల కోసం మంత్రి అవసరమైన ప్లాట్ఫామ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అనంతరం మహాలక్ష్మి ఉచితబస్సులో ప్రతిరోజు ప్రయాణించే నలుగురు మహిళలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రయాణికురాలు కల్పన మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకం మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన గొప్ప గౌరవమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రులు, ఉద్యోగాలు, చిన్నవ్యాపారాల కోసం ప్రయాణించే మహిళలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జాన్ రెడ్డి ,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి. జిల్లా మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి ,సిడిపిఓ హరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిపో మేనేజర్ రమణ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.


## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం పదవీ విరమణ పొందిన ఇద్దరు ఎస్సైలను, ఒక ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వీడ్కోలు సన్మానం చేశారు. 37 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై మీర్జా కమల్షా బేగ్, 37 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం దమ్మపేట పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న ఎస్ ఐ వంక రామరాఘవయ్య , 36 సంవత్సరాలుగా పనిచేసి ప్రస్తుతం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పరిశిక మల్లికార్జున రావులు పదవీ విరమణ చేశారు. పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ నుంచి పదవీ విరమణ పొందిన అధికారులు , సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యా నాయక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఎంటిఓ సుధాకర్,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణ మరియు జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పది ఉత్తీర్ణతలో.. జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

**: - ఎంఈఓ గురువా రావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పదో తరగతి ఉత్తీర్ణతలో యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుదామని మండల విద్యాధికారి గురువారావు అన్నారు. చౌటుప్పల్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ట్రస్మా చౌటుప్పల్ డివిజన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. చౌటుప్పల్ ఎంఈఓ గురువారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం జిల్లాలోని పాఠశాలలన్నీ కలిసికట్టుగా పదో తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూర్ల వెంకటేష్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ లను ట్రస్మా సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కెవి కృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మెరుగు మధు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తండా కృష్ణంరాజు, మంజుల, షాహిదా బేగం, కే కృష్ణారావు, మూర్తి, శ్రీనివాస్, భాస్కరాచారి, షమీమ్, కృష్ణారావు, కోటేశ్వరరావు, గోపాల్ రెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాన్ని కలిసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ (ప్రజాస్ఫూర్తి విలేఖరి) చీర్ల శివ సాగర్ కుటుంబానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెబ్బేరు మునిసిపాలిటీ పరిధిలోని జర్నలిస్టు కాలనీలో విలేకరి గృహ ప్రవేశం సందర్భంగా ఆయన ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వారి కుటుంబం ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెబ్బేరు శ్రీరంగాపురం మండలాల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలి

**: డీఎస్పి ఆదినారాయణ**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రతి విద్యార్థి సమాజంపై బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలని కొత్తగూడెం డి.ఎస్.పి ఆదినారాయణ ఆకాంక్షించారు. స్థానిక రామ్నగర్లోని ఎస్ఆర్ డీజీ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పెరిగిపోతున్న అవినీతి, డ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మన చుట్టుపక్కల జరుగుతున్న అవినీతిపై జాగరుకులై ఉండాలని కోరారు. సిఐ వెంకటేశ్వర్లు రోడ్డు వారోత్సవాలలో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ కొత్తగూడెం జోనల్ ఇంచార్జ్ సతీష్, ఎస్సై రవికుమార్, ఎస్ఆర్ డిజి ప్రిన్సిపల్ తిరుమల్ రెడ్డి, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేయాలి

**: కలెక్టర్ అంకిత్**



ప్రజా స్ఫూర్తి; భద్రాద్రి కొత్తగూడెం: యాసంగి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించి రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ సమావేశంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 1,87,309 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా ఉండగా, అందులో సన్న రకం 1,35,365 టన్నులు, దొడ్డు రకం 51,944 టన్నులుగా తెలిపారు. 168 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే మరిన్ని కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. ఏ గ్రేడ్కు రూ.2389, బి గ్రేడ్కు రూ.2369 మద్దతు ధరలు నిర్ణయించగా, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ సదుపాయాలు కల్పించాలని, రద్దీ నియంత్రణకు టోకెన్ విధానం అమలు చేయాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్పోస్టుల ద్వారా అక్రమ రవాణాపై నిఘా పెంచినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు వెంటనే ఆన్లైన్ నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కొనుగోళ్లు విజయవంతం చేయాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు.

## పరిశ్రమలపై కరెంటు భారం

* విద్యుత్ ఛార్జీలలో మార్పులు
* ఉదయం, సాయంత్రం 6 నుంచి 10 వరకు వాడితే యూనిట్‌కు రూ.1.50 ఎక్కువ
* ఛార్జింగ్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఎయిర్‌పోర్ట్‌లకూ వర్తింపు
* నేటి నుంచి అమల్లోకి



హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం నుంచి కొత్త కరెంటు ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. హైటెన్షన్(హెచ్‌టీ) కరెంటు కనెక్షన్ తీసుకున్న 6 కేటగిరీల ఛార్జీల్లో మార్పులు చేస్తూ ఈఆర్‌సీ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కొత్త ఆర్థిక సంవత్సరం(202627)లో ఈ మేరకు ఛార్జీలను వసూలు చేయాలని డిస్కంలను ఆదేశించింది. రెండు రకాలుగా ఛార్జీలను అమలు చేయాలని సూచించింది. ఇలా వసూలు చేసే విధానాన్ని టైం ఆఫ్ డే(టీవోడీ) టారిఫ్ అని వ్యవహరిస్తారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య కరెంటు వినియోగించే 6 రకాల హెచ్‌టీ కనెక్షన్ల వారికి సాధారణ ఛార్జీకన్నా యూనిట్‌కు రూ.1.50 ఎక్కువ వసూలు చేయాలని ఈఆర్‌సీ ఆదేశించింది. ఇంతకాలం ఇది రూపాయి మాత్రమే ఉండగా 50 పైసలు అదనంగా పెంచింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు వినియోగిస్తే... ఇవే 6 కేటగిరీలకు యూనిట్‌కు 50 పైసల ప్రోత్సాహకమిచ్చి అంతమేర ఛార్జీని తగ్గిస్తారు. ఇంతకాలం ఈ ప్రోత్సాహకం యూనిట్‌కు రూపాయి చొప్పున ఉండగా 50 పైసలకు తగ్గించారు.
రోజూ రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు కరెంటు వినియోగిస్తే ఈ 6 కేటగిరీలకు గతంలో మాదిరిగానే ఛార్జీలుంటాయి.

**ఎందుకీ మార్పులంటే...**

విద్యుత్ డిమాండు రాష్ట్రంలో రోజూ ఉదయం, సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య గరిష్ఠ స్థాయికి చేరి ఆ తరవాత గణనీయంగా పడిపోతోంది. దీనివల్ల విద్యుత్ గ్రిడ్ నిర్వహణ సవాలుగా మారి సాంకేతిక సమస్యలతో సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాటిని నివారించడానికి గరిష్ఠ కరెంటు డిమాండు ఉన్న సమయంలో పరిశ్రమల వాడకం తగ్గించేలా.. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు తిరిగి రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు ఎక్కువ వాడేలా ఈ విధానాన్ని రూపొందించారు. కరెంటు బిల్లుల భారం తగ్గాలంటే 6 రకాల హెచ్‌టీ కనెక్షన్ల వారు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు లేదా రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్‌ను వినియోగించుకోవాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు డిమాండు అధికంగా ఉన్నప్పటికీ.... అదే సమయంలో సౌరవిద్యుదుత్పత్తి అధికంగా ఉంటోంది. ఈ సమయంలో హెచ్‌టీ వర్గాల వారు అధికంగా కరెంటు వాడితే యూనిట్‌కు 50 చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని ఈఆర్‌సీ ఆదేశించింది. సౌరవిద్యుత్ యూనిట్ రూ.3 నుంచి రూ.4కే మార్కెట్‌లో లభిస్తోంది. అదే థర్మల్ విద్యుత్‌ను ఉదయం, సాయంత్రం 6 నుంచి 10 వరకు... కొనాలంటే యూనిట్‌కు రూ.6 వరకు వ్యయమవుతోంది. ఈ ఆర్థిక భారాన్ని డిస్కంలకు తగ్గించడానికే ఆ వేళల్లో కరెంటు వాడే హెచ్‌టీ కనెక్షన్ల వారికి యూనిట్‌కు అదనంగా రూపాయిన్నర చొప్పున ఛార్జీ పెంచాలని ఈఆర్‌సీ నిర్ణయించింది.

## పసుపు ధరలకు యుద్ధం సెగ!

* క్వింటాకు రూ.4 వేలకుపైగా నష్టం



నిజామాబాద్: పశ్చిమాసియాలో యుద్ధం పసుపు రైతుకు నష్టాన్ని తెచ్చిపెడుతోంది. విదేశాలకు పంట ఎగుమతులు నిలిచిపోవడంతో గత వారం రోజులుగా ధరలు తగ్గుతూ వస్తున్నాయి. క్వింటాకు రూ.4 వేలకుపైగా రైతు నష్టపోతున్నాడు. పసుపు విక్రయాలు అత్యధికంగా జరిగే ఆసియాలోని మార్కెట్లలో నిజామాబాద్ ఒకటి. ఇక్కడి యార్డులో కొనుగోలు చేసే పంటను విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. స్థానిక రైతులతో పాటు నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల నుంచి రైతులు తెచ్చే పసుపును కమీషన్ ఏజెంట్లు కొంటారు. వారి ద్వారా ట్రేడర్లు ఆర్డర్లపై ఎగుమతి చేస్తారు. ఏటా ఫిబ్రవరి నుంచి పంట మార్కెట్‌కు వస్తుంది. 2024లో రూ.171 కోట్ల విలువైన 1.45 లక్షల టన్నుల పసుపును భారత్ ఎగుమతి చేసింది. ఇందులో నిజామాబాద్‌లో కొనుగోలు చేసే నాణ్యమైన సరకు కూడా ఉంది. ఈ ఏడాది యుద్ధ ప్రభావంతో గల్ఫ్, ఇతర దేశాలకు ఎగుమతులు నిలిచాయి. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల ట్రేడర్లు ఇందూరు పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

**సాగు విస్తీర్ణం పెరిగినా..**

నిజామాబాద్ యార్డులో 2024లో రికార్డు స్థాయిలో 8.41 లక్షల క్వింటాళ్ల పసుపు విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 3.74 లక్షల క్వింటాళ్ల పంట వచ్చింది. గత రెండు సీజన్ల ఆరంభంలో మహారాష్ట్రలోని సాంగ్లీలో క్వింటా రూ.17,500, నిజామాబాద్‌లో రూ.15 వేలు పలకడంతో ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగింది. తెలంగాణలో 50 వేల ఎకరాల్లో పంట సాగుకాగా.. ఒక్క నిజామాబాద్‌లోనే 25 వేల ఎకరాల్లో వేశారు. ఈ సీజన్ మొదట్లో నిజామాబాద్‌లో క్వింటా రూ.15,500, సాంగ్లీలో రూ.18 వేలు పలికింది. యుద్ధం ప్రారంభం అనంతరం దేశవ్యాప్త మార్కెట్లలో గరిష్ఠ ధర సగటున రూ.1213 వేల మధ్యే పలుకుతోంది. చాలా సరకు రూ.9,000రూ.11,000 లోపే కొంటున్నారు. 'ఏడు క్వింటాళ్ల పసుపు నిజామాబాద్ మార్కెట్‌కు తెచ్చా. మూడు క్వింటాళ్లకు రూ.9,266, మిగతా సరకుకు రూ.10 వేల చొప్పున ధర పలికింది' అని షట్‌పల్లికి చెందిన రైతు నర్సన్న తెలిపారు. 'ఎంతో వ్యయప్రయాసలతో ఆరు క్వింటాళ్ల పసుపును తెచ్చా. సగం పంటే అమ్ముడుపోయింది. ధర కూడా రూ.9,660 మాత్రమే దక్కింది. మిగతా పంట అమ్ముకునేందుకు నిరీక్షిస్తున్నా' అని నిర్మల్ జిల్లాకు చెందిన రైతు సాయన్న చెప్పారు. 'హర్మూజ్ జలసంధి మీదుగా ఓడల రాకపోకలు నిలిచిపోవడంతో మేం పంపిన 1000 టన్నుల సరకు తిరిగి వచ్చేసింది. రవాణా ఖర్చులతో బాగా నష్టపోయాం' అని ఎగుమతిదారుడు సురేశ్ చౌదరి వాపోయారు.

## నాణ్యమైన విద్యుత్.. లో వోల్టేజ్ కి చెక్

- 12, 19వార్డులలో 100కేవి ట్రాన్స్ ఫార్మర్లు ప్రారంభం
- చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మున్సిపల్ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించడంతో పాటు లో వోల్టేజ్ సమస్య లేకుండా చెక్ పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 12, 19వార్డులలో నూతనంగా ఏర్పాటు చేసిన 100కేవి ట్రాన్స్ ఫార్మర్లను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా 12, 19వార్డుల్లోని గృహిణులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత కౌన్సిలర్లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అధికారులతో మాట్లాడి యుద్ధప్రతిపాదికన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేశానన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో భవిష్యత్తులో చౌటుప్పల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్,12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, ఎస్ కే జానీ బాబు, దేప రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబు, శ్రీకాంత్ గౌడ్, విద్యుత్ శాఖ ఏఈ సతీష్‌కుమార్, వర్కాల రాము గౌడ్, ఇప్ప వెంకటేష్, మలిగే మల్లేష్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నపళంగా ఉరిమిన వాన

* ఉమ్మడి కరీంనగర్ సహా పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం
* మామిడి, పలు పంటలు ధ్వంసం
* నిజామాబాద్‌లో తడిసిన పసుపు దిగుబడులు

హైదరాబాద్, నిజామాబాద్ : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అన్నదాతలకు తీరని నష్టాన్ని కల్గించాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. జగిత్యాల జిల్లావ్యాప్తంగా పంటలకు అధిక నష్టం జరిగింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో 5.6 సెం.మీ. వర్షం కురిసింది. ఇదే జిల్లా వాంకిడిలో 4.5, సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 3.7, జనగామ జిల్లా దేవరుప్పలలో 3.5, మంచిర్యాల జిల్లా తాండూరులో 2.6, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలంలో 2.5 సెం.మీ. కురిసింది. ములుగు, రంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల జిల్లాల్లోనూ 1.6 సెం.మీ నుంచి 2.4 సెం.మీ మధ్య నమోదైంది. పగటిపూట పలు జిల్లాల్లో వడగళ్లు పడ్డాయి.

* జగిత్యాల జిల్లాలో 9 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

గాలివానల కారణంగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల జిల్లాలో మొత్తం 20 మండలాల్లోని 126 గ్రామాల్లో 5,986 మంది రైతులకు చెందిన 9,393 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా 6,162 ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. 1,521 ఎకరాల్లో మొక్కజొన్న పైరు నేలవాలింది. 1,128 ఎకరాల్లో వరి పైర్లు పడిపోగా కోతదశలో ఉన్న పంటలో గింజలు రాలిపోయాయి. 582 ఎకరాల్లో నువ్వు పంటకూ నష్టం జరిగింది. పలుచోట్ల కూరగాయలు, జొన్న, సజ్జ తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆయా పంటలను జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. ఉడికించి కల్లాల్లో ఆరబెట్టిన పసుపు కొమ్ములు, మక్కలు, జొన్నలు, కందులు తదితర ఉత్పత్తులు సైతం తడిసి ముద్దయ్యాయి. నిజామాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన పసుపు కుప్పలు వర్షపు నీటిలో తడిశాయి. రాత్రివేళ ఉన్నట్టుండి వాన రావడంతో కొమ్ములను సంచుల్లో నింపలేకపోయినట్లు రైతులు వాపోయారు.

**13 జిల్లాల్లో దడ పుట్టించిన ఎండలు**

మంగళవారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా నమోదయ్యాయి. ఏడు జిల్లాల్లో 41 డిగ్రీలు దాటింది. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో 41.7, నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లో 41.5, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 41.4, ఆదిలాబాద్ జిల్లా బేలలో 41.2, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 41.1, నల్గొండ జిల్లా గట్టుప్పల్‌లో 41.1 డిగ్రీలుగా నమోదైంది. కుమురంభీం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, మంచిర్యాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, మెదక్, వనపర్తిలలో 40 డిగ్రీలపైన నమోదయ్యాయి.

**నేడు, రేపు, ఎల్లుండి వడగళ్ల వానలు**

రాష్ట్రంలో బుధ, గురు, శుక్రవారాల్లో పలు జిల్లాల్లో వడగళ్ల వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. 40 కి.మీ. నుంచి 50 కి.మీ. వేగంతో కూడిన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు పేర్కొంది.

## బాసర వర్సిటీ.. ఇన్‌ఛార్జి వీసీలే గతి




* 11 సంవత్సరాల నుంచి మారని దుస్థితి
* తరచూ విద్యార్థుల ఆందోళనలు

హైదరాబాద్: గ్రామీణ విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీ తరహా నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అందించాలన్న లక్ష్యంతో నెలకొల్పిన బాసరలోని రాజీవ్‌గాంధీ సాంకేతిక, వైజ్ఞానిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ) తరచూ వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దేశంలో 11 ఏళ్లకుపైగా శాశ్వత వీసీ లేని ఏకైక విశ్వవిద్యాలయం ఇదే. గురుకులాల తరహాలో పూర్తిస్థాయి రెసిడెన్షియల్ వర్సిటీ కావడం, తొమ్మిది వేల మందికిపైగా విద్యార్థులు ఉండటంతో ఏ సమస్య తలెత్తినా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతోంది. సమస్యలకు ఎప్పటికప్పుడు తాత్కాలిక పరిష్కారాలు చూపుతూ ఉన్నతాధికారులు కాలం గడిపేస్తున్నారు. తాజాగా ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం, మరో విద్యార్థిని మృతి చెందటంతో వర్సిటీలో వైద్య సౌకర్యాల లేమిపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీనికి పరిష్కారం దొరక్క ఏకంగా వర్సిటీని మూసివేసి... విద్యార్థులను ఇళ్లకు పంపించడం గమనార్హం.

**2015 ఫిబ్రవరి నుంచి ఐదో ఇన్‌ఛార్జి...**

వర్సిటీని 2008లో స్థాపించగా... 2010 ఫిబ్రవరి నుంచి 2015 ఫిబ్రవరి వరకు ఐఐటీ ఖరగ్‌పుర్‌కు చెందిన ఆచార్య ఆర్‌వీ రాజ్‌కుమార్ వీసీగా వ్యవహరించారు. ఆయన పదవీ కాలం ముగిశాక రెండేళ్లపాటు ఓయూ మాజీ వీసీ సత్యనారాయణ ఇన్‌ఛార్జి వీసీగా పనిచేశారు. ప్రభుత్వం 2017 సెప్టెంబరులో అప్పటి ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్‌కుమార్‌ను ఇన్‌ఛార్జి వీసీగా నియమించింది. ఆయన 2020 ఫిబ్రవరి వరకు పనిచేశారు. తర్వాత అప్పట్లో సీఎం కార్యాలయంలో పనిచేస్తున్న రాహుల్ బొజ్జాను నియమించగా ఆయన రెండేళ్లపాటు ఉన్నారు. 2022 జులైలో నాటి ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య వెంకటరమణను ఇన్‌ఛార్జి వీసీగా నియమించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 అక్టోబరులో నూతన ఇన్‌ఛార్జి వీసీగా జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ఆచార్యుడు గోవర్ధన్‌ను పంపించారు.

**'చట్టం'పై ఎటూ తేల్చని ప్రభుత్వాలు**

రాష్ట్రంలోని మిగిలిన వర్సిటీలకు భిన్నంగా ఆర్‌జీయూకేటీ చట్టం ఉంది. దాని ప్రకారం పాలకమండలి(గవర్నింగ్ బాడీ) ఎవరైనా విద్యావేత్తను ఛాన్స్‌లర్‌గా నియమిస్తుంది. ఆయన వీసీని నియమిస్తారు. రాష్ట్ర విభజన తర్వాత ఛాన్స్‌లర్‌ను నియమించలేదు. కేవలం ఒక ప్రాంగణానికే ఛాన్స్‌లర్ ఎందుకని... మిగిలిన వర్సిటీల మాదిరే గవర్నర్‌ను కులపతిగా చేయాలని గత భారాస ప్రభుత్వం భావించింది. అందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి, చట్టాన్ని మార్చాల్సి ఉంటుంది. ఈ మేరకు వర్సిటీల చట్టాల పునఃసమీక్షపై 2018లోనే ఓయూ మాజీ వీసీ సులేమాన్ సిద్ధిఖీ ఛైర్మన్‌గా కమిటీని నియమించగా... ఆర్‌జీయూకేటీకి కూడా గవర్నరే కులపతిగా ఉండాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. దానిపై అప్పటి ప్రభుత్వం ఏదీ తేల్చలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా అదే పరిస్థితి. ఉన్న చట్టాన్ని యథాతథంగా అమలు చేయడం లేదు. కొత్త చట్టాన్ని తేవడం లేదు. వర్సిటీలో 146 మంది శాశ్వత బోధనా సిబ్బందికి 19 మందే ఉన్నారు. మిగిలిన వారంతా కాంట్రాక్టు, అతిథి అధ్యాపకులే. ఫలితంగా విద్యలోనూ నాణ్యత సైతం పడిపోతోందని విద్యార్థులు వాపోతున్నారు.

## కాళేశ్వరం మరమ్మతులు మరింత జాప్యం

* ఇప్పటికీ పూర్తికాని పరీక్షలు
* ప్రశ్నార్థకంగా బ్యారేజీల పునరుద్ధరణ



హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతుకు సంబంధించిన పరీక్షలు మరింత జాప్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కీలకమైన పరీక్షలను ఈ ఏడాది వర్షాకాలంలోగా పూర్తి చేయాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించింది. పూర్తయిన పరీక్షలు, ఇంకా చేయాల్సినవి పరిగణనలోకి తీసుకొంటే ఈ ఏడాది మరమ్మతులు ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. బ్యారేజీల పునరుద్ధరణ ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్డీఎస్ఏ.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతులపై ఓ నిర్ణయానికి వచ్చేందుకు అవసరమైన పలు పరీక్షలను చేయించాలని సూచించింది. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌ను స్టెబిలైజ్ చేయాలని లేదా పూర్తిగా తొలగించాలని సిఫార్సు చేయగా, ఇప్పటివరకు ఈ బ్లాక్‌పై అతీగతీలేదు. ఈ బ్యారేజీలో ఇది కీలకం. ఈ పని ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లోని పిల్లర్లు కుంగాయి. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీ సమస్యలు వచ్చాయి. మరమ్మతులు జరిగే వరకు నీటిని నిల్వ చేయవద్దని ఎన్డీఎస్ఏ సూచించింది. నీటిని నిల్వ చేయకుండా పరీక్షలను చేపట్టినా, పరీక్షల సంఖ్య, బోర్‌హోల్ డ్రిల్లింగ్‌తో సహా అనేక ఏర్పాట్లు చేయాల్సి ఉండటంతో జాప్యం జరుగుతోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

**మేడిగడ్డ కాంక్రీటు స్ట్రక్చర్ పటిష్ఠతను తెలుసుకోవడానికి...**

బ్యారేజీలకు కీలకమైన జియో టెక్నికల్; జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్స్, కాంక్రీటు స్ట్రక్చర్‌ను అంచనా వేయడానికి చేయాల్సిన పరీక్షలు ఇంకా ప్రారంభం కాలేదు. మేడిగడ్డ బ్యారేజీలో యు.పి.వి.రీబండ్ హ్యామర్ పరీక్షలు ఐదు బ్లాక్‌లలో మాత్రమే పూర్తయ్యాయి. మరో మూడు బ్లాక్‌లకు ఇంకా జరగాల్సి ఉంది. అన్ని బ్లాక్‌లకు పూర్తయితేనే ఓ నిర్ణయానికి రావడానికి వీలవుతుందని సంబంధిత ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. అన్నారం బ్యారేజీలో 22 వెంట్స్‌కు పూర్తి కాగా, మరో 32కు ఇంకా చేయాల్సి ఉంది. మేడిగడ్డలో జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్‌కు అవసరమైన బోర్‌హోల్స్ కోసం మూడు డ్రిల్లింగ్ మిషన్లు వచ్చాయని, మరో మూడు త్వరలోనే వస్తాయని గత వారం నీటిపారుదల శాఖ ఎన్డీఎస్ఏ ఛైర్మన్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. మేడిగడ్డ కాంక్రీటు స్ట్రక్చర్ పటిష్ఠతను తెలుసుకోవడానికి 30 బోర్‌హోల్స్ వేయాలి. జియోటెక్నికల్ అధ్యయనంలో భాగంగా సీపేజీ విశ్లేషణకు 16 బోర్‌హోల్స్ వేయాలి. ఇవి కూడా ప్రారంభం కాలేదు. టోమోగ్రఫీ పరీక్షలకు 458 వేయాల్సి ఉండగా నాలుగు పూర్తయ్యాయి. బ్యారేజీ రాఫ్ట్ దిగువన పరిస్థితిని అంచనా వేయడానికి 85 వెంట్స్‌లో జియోఫిజికల్ స్టడీస్ చేయాలి. 2డీ హైడ్రాలిక్ మోడల్ స్టడీస్, 3డీ హైడ్రాలిక్ మోడల్ స్టడీస్ ఏ బ్యారేజీలోనూ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. 3డీ హైడ్రాలిక్ మోడల్ స్డడీస్ బ్యారేజీ ఎగువ భాగంలో ఐదారు కిలోమీటర్లు, దిగువన మూడు నాలుగు కి.మీ. చేయాల్సి ఉంటుంది. డిజైన్ చేసినట్టుగా వరద వెళ్లే సామర్థ్యం ఉందో లేదో తెలుసుకోవడానికి ఈ అధ్యయనాలు కీలకమని చెప్తున్నా, ఇంకా ప్రారంభం కాలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో కూడా ఇదే పరిస్థితి. అన్నారం బ్యారేజీని ఇప్పటికీ ఇసుక సమస్య వెంటాడుతోంది. ఇసుకను తొలగిస్తే కానీ పరీక్షలు పూర్తి స్థాయిలో చేయలేమని పుణెలోని సెంటర్ ఫర్ వాటర్ అండ్ పవర్ రీసెర్చి స్టేషన్ శాస్త్రవేత్తలు తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఏప్రిల్ ఆఖరుకు కొన్ని, జూన్ ఆఖరుకు మరికొన్ని పరీక్షలు పూర్తి చేస్తామని ప్రాజెక్టు ఇంజినీర్లు ఇటీవల ఎన్డీఎస్ఏ ఛైర్మన్‌కు నివేదించినా ఆచరణ మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

## ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు వేళాయె!



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారుల ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో లక్ష మంది కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టే విధంగా హౌసింగ్‌శాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఏప్రిల్‌లో 1, 20, 21, 30 తేదీలు, మే నెలలో 4, 8, 13, 14, 18, 25, 27, 28 తేదీలతోపాటు జూన్ మొదటి వారంలో లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు ముహూర్తాలను ఖరారు చేసింది. ఏప్రిల్ 1న (బుధవారం) 4,100 మంది లబ్ధిదారులు తమ కొత్త ఇళ్లలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో ఉగాది కంటే ముందు 9,676 మంది, పండగ రోజు మరో 900 మంది లబ్ధిదారులు కొత్త ఇళ్లలోకి అడుగు పెట్టారు. ఏప్రిల్ చివరినాటికి మొత్తం 33 వేల మంది లబ్ధిదారులు కొత్తగా కట్టుకున్న ఇళ్లలోకి మారనున్నారు. గృహప్రవేశాలు చేసే లబ్ధిదారుల సంఖ్య మే నెల చివరినాటికి 60 వేలకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా 40 వేల ఇళ్లకు జూన్‌లో ముహూర్తాలను నిర్ణయించారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మంచి రోజులను ఎంపిక చేసి ప్రవేశాలకు హౌసింగ్‌శాఖ తేదీలను ఖరారు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 32 జిల్లాల పరిధిలో 3.68 లక్షల ఇళ్లను హౌసింగ్‌శాఖ కేటాయించింది. ఇందులో 3.24 లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చింది. మార్చి చివరి నాటికి 2.66 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఇందులో 17,800 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

# కార్యకర్త కుటుంబానికి మంత్రి లోకేశ్ అండ... జీవితాంతం తోడుగా ఉంటానని భరోసా







అమరావతి : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఆపద వస్తే అండగా నిలవడంలో ముందుండే ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గతేడాది విద్యుత్ ప్రమాదంలో మరణించిన కర్నూలు జిల్లాకు చెందిన పార్టీ కార్యకర్త ఎమ్. అర్జున్ కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి కుటుంబ బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు ప్రకటించి, వారికి ధైర్యం చెప్పారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి అర్జున్ కుటుంబ సభ్యులను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ఆహ్వానించారు. అర్జున్ తల్లిదండ్రులైన మస్టిక్ మద్దిలేటి, రాణి, సోదరి కోమలితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, అర్జున్ మరణం పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కర్నూలు జిల్లా, మునగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎమ్. అర్జున్ గతేడాది నన్నూరు సమీపంలో జరిగిన ఓ దురదృష్టకర ఘటనలో విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. అప్పటి నుంచి ఆ కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్, వారిని పరామర్శించి ధైర్యం చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా అర్జున్ సోదరి కోమలి చదువుల గురించి మంత్రి లోకేశ్ ఆరా తీశారు. ఆమె విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. "మీ కుటుంబ బాధ్యత ఇకపై నాది. జీవితాంతం మీకు అండగా ఉంటాను. ఏ అవసరం వచ్చినా సంకోచించవద్దు" అని మంత్రి వారికి హామీ ఇచ్చారు. లోకేశ్ మాటలతో ఆ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. తమ కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచి, భవిష్యత్తుపై భరోసా కల్పించిన మంత్రి నారా లోకేశ్‌కు అర్జున్ కుటుంబ సభ్యులు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారని వారు ఆనందం వ్యక్తం చేశారు.





## ఆకివీడు రామాలయం పునర్నిర్మాణానికి చందాలు ఆహ్వానిస్తున్న రఘురామ

ఆకివీడు పెదపేటలో ఉన్న శ్రీరాముని ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భక్తులు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణం కోసం విరాళాలు ఇవ్వాలనుకునే భక్తులు కనీసం 100 రూపాయల నుంచి గరిష్టంగా 10 వేల రూపాయల వరకు అందించవచ్చని ఆయన తెలిపారు. ఈ విరాళాలను నేరుగా ఆలయ అభివృద్ధి సమితి బ్యాంకు ఖాతాకు జమ చేయవచ్చని సూచించారు. విరాళాలు పంపేందుకు వీలుగా బ్యాంకు ఖాతా వివరాలను కూడా ఆయన పంచుకున్నారు. ఆసక్తి ఉన్నవారు ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా తమ విరాళాలను పంపవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

* **విరాళాల కోసం బ్యాంకు ఖాతా వివరాలు:**
* అకౌంట్ పేరు: శ్రీరామ ఆలయ అభివృద్ధి సమితి, ఆకివీడు
* ఖాతా నంబర్: 120039562348
* IFSC కోడ్: CNRB0002775
* బ్యాంకు: కెనరా బ్యాంక్, ఆకివీడు బ్రాంచ్

ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా ఆకివీడు రామాలయం వద్ద రఘురామపై ఓ వర్గం దాడికి యత్నించడం తీవ్ర కలకలం రేపింది. అయినప్పటికీ, ఆలయ పునర్ నిర్మాణానికి రఘురామ చొరవ చూపుతుండడం పట్ల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

## ఇంద్రకీలాద్రిపై సిబ్బంది చేతివాటం.. బంగారాన్ని రోల్డ్‌గోల్డ్‌గా మార్చేందుకు యత్నం



ఇంద్రకీలాద్రి: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయ హుండీ లెక్కింపులో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. భక్తులు సమర్పించిన బంగారాన్ని దారి మళ్లించే ప్రయత్నం చేశారు. అసలైన బంగారాన్ని రోల్డ్ గోల్డ్‌గా మార్చేందుకు యత్నించారు. అనుమానంతో ట్రస్ట్ బోర్డు సభ్యులు తనిఖీలు చేయగా విషయం వెలుగుచూసింది. తనిఖీల్లో సిబ్బందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.1.25లక్షల విలువైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులైన సిబ్బందికి ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

## రాష్ట్ర విభజన కంటే.. వైకాపా పాలనతోనే ఎక్కువ నష్టం: నిమ్మల




కర్నూలు: రాష్ట్ర విభజన, వైకాపా దివాలా పాలన అనంతరం ఇప్పుడిప్పుడే పరిస్థితి మెరుగవుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం చంద్రబాబు ఎలా మెరుగుపరుస్తున్నారో వివరించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందన్నారు. కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహించిన బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్‌తో కలిసి నిమ్మల పాల్గొన్నారు. "అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోంది. 2024 వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్‌పై ఉంది. రాష్ట్ర విభజన కంటే గత వైకాపా పాలనతోనే ఎక్కువ నష్టం జరిగింది. ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు అందిస్తున్నాం. అమరావతిని శాశ్వత రాజధానిగా నిర్మిస్తున్నాం. విధ్వంసమైన పోలవరాన్ని గాడిలో పెట్టాం. 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసేలా పనులు చేస్తున్నాం. సంపద సృష్టిస్తూ.. ప్రజలకు సంపద పంచేలా చంద్రబాబు పాలన సాగుతోంది" అని నిమ్మల వివరించారు.

## ఏపీ పోలీసుల చేతికి కొత్త అస్త్రం.. సెకన్లలోనే నేరచరిత బట్టబయలు!



ఏపీలో నేరాలను నియంత్రించి, పాత నేరస్థులకు చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఇందులో భాగంగా తాజాగా 'పాపిల్లాన్ ఫింగర్ ప్రింట్ స్కానర్' అనే అత్యాధునిక పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పరికరం సాయంతో అనుమానితుల నేర చరిత్రను కేవలం సెకన్ల వ్యవధిలోనే తెలుసుకోవచ్చు. నేర నియంత్రణలో ఇది ఒక కీలక అస్త్రంగా మారనుందని పోలీస్ శాఖ భావిస్తోంది. ఈ స్కానర్ చాలా చిన్నదిగా, తేలికగా ఉండటంతో పోలీసులు విధుల్లో ఉన్నప్పుడు సులభంగా తమతో పాటు తీసుకెళ్లవచ్చు. దీనిని మొబైల్‌లోని ప్రత్యేక యాప్‌తో అనుసంధానిస్తారు. అనుమానిత వ్యక్తి బొటన వేలు లేదా చూపుడు వేలి ముద్రను స్కానర్‌పై ఉంచిన వెంటనే, ఆ వివరాలు పోలీస్ శాఖ వద్ద ఉన్న డేటాబేస్‌తో సరిపోల్చుకుంటాయి. ఒకవేళ ఆ వ్యక్తిపై రాష్ట్రంలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా కేసులు నమోదై ఉన్నా, రౌడీ షీట్ తెరిచి ఉన్నా.. ఆ వివరాలన్నీ క్షణాల్లో స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఏ కేసు, ఎక్కడ నమోదైంది వంటి పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఒకవేళ ఎలాంటి నేర చరిత్ర లేకపోతే 'నాట్ ఫౌండ్' అని చూపిస్తుంది. ముఖ్యంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పాత నేరస్థులు, దొంగలు ప్రయాణికులతో కలిసిపోయి నేరాలకు పాల్పడుతుంటారు. వారిని గుర్తించడం పోలీసులకు సవాలుగా ఉండేది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని, ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరస్థులను పట్టుకోవడం కష్టమయ్యేది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీ కాస్తున్న సిబ్బందికి అనుమానితులను విచారించినా, వారిపై కేసులు ఉన్నాయో? లేదో? తెలుసుకోవడానికి సమయం పట్టేది. ఈ సమస్యలకు పరిష్కారంగా ఈ కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టారు. ఈ పాపిల్లాన్ స్కానర్ రాకతో పోలీసుల పనితీరు మరింత సులభతరం కానుంది. నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, అనుమానితుల వివరాలను వెంటనే ధృవీకరించుకోవడం ద్వారా నేరాలు జరగకముందే నివారించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా నేరాల నియంత్రణలో ఈ పరికరం ఒక కీలక సాధనంగా ఉపయోగపడనుంది.

## త్వరలో తుళ్లూరులో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం: బాలకృష్ణ



హైదరాబాద్: క్యాన్సర్ చికిత్స అందరికీ అందుబాటులో ఉంచాలనేదే తమ లక్ష్యమని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆస్పత్రిలో అడ్వాన్స్డ్ అల్ట్రాసౌండ్ సహా పలు పరికరాలు, అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. ''బీడీఎల్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ఆస్పత్రికి విరాళంగా ఇచ్చారు. ఏఐ సాంకేతికత కలిగిన యంత్రం ఇది. తక్కువ సమయంలోనే స్కానింగ్ చేసి కచ్చితత్వంతో కూడిన ఫలితాలను అందిస్తుంది. దాతల సహకారంతో ఆస్పత్రిలో పేదలకు మెరుగైన సేవలు అందించగలుతున్నాం. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు, దాతల సహకారంతో ఆస్పత్రి ఈ స్థాయికి చేరింది. త్వరలో దీన్ని విస్తరిస్తాం. ఏపీ రాజధాని పరిధి తుళ్లూరులో మరో వారం రోజుల్లో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభిస్తాం'' అని బాలకృష్ణ తెలిపారు.

## ఏపీలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు.. మూడు మార్గాల్లో రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం



విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ఒక ట్యాంకర్ గూడ్స్ రైలు కొమ్మరపూడి రైల్వే జంక్షన్ సమీపంలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో రెండు ట్యాంకర్ వ్యాగన్లు బోల్తా పడటంతో ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందిన వెంటనే రైల్వే ఉన్నతాధికారులు, సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బోల్తా పడిన ట్యాంకర్ వ్యాగన్లను ట్రాక్ నుంచి తొలగించి, పట్టాలను యథాస్థితికి తీసుకురావడానికి సుమారు 200 మంది రైల్వే సిబ్బంది శ్రమిస్తున్నారు. భారీ క్రేన్ల సహాయంతో వ్యాగన్లను పక్కకు తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయి. ట్రాక్ దెబ్బతినడంతో మరమ్మతులు పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా ప్రధానంగా మూడు మార్గాల్లో రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది:

విజయవాడ - తిరుపతి, విజయవాడ - చెన్నై, కొమ్మరపూడి జంక్షన్ - కృష్ణపట్నం

ఈ మార్గాల్లో నడవాల్సిన పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు వివిధ స్టేషన్లలో నిలిచిపోయాయి. మరికొన్ని రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో స్టేషన్లలో వేచి ఉన్న ప్రయాణికులకు తాగునీరు, ఇతర సౌకర్యాల విషయంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని రైల్వే వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. వీలైనంత త్వరగా రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

## వైకాపా చేపట్టిన 'పోర్టుకు పోదాం రండి' ఓ డ్రామా: దువ్వాడ శ్రీనివాస్



టెక్కలి పట్టణం: వైకాపా నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలో నిర్వహించిన 'మూలపేట పోర్టుకు పోదాం రండి' కార్యక్రమం ఓ డ్రామా అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన ఓ వీడియో విడుదల చేశారు. పోర్టుకు పోదాం రండి అని పిలుపునిచ్చి 10 కిలోమీటర్ల దూరంలో టెంటువేసి మాట్లాడారని.. పోర్టు లోపలికి ఎందుకు వెళ్లలేదని దువ్వాడ ప్రశ్నించారు. 40 మందికి పోర్టులోపలికి వెళ్లి పరిశీలించేందుకు అవకాశం ఇచ్చినప్పటికీ ఆ ఆలోచన చేయకుండా అందర్నీ మభ్యపెట్టి తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. అక్కడ నిర్వహించిన సభలో నిర్వాసితులు, పోర్టుకు 100మీటర్ల రహదారి ఇచ్చి త్యాగాలు చేసినవారి ఇబ్బందులపై మాట్లాడలేదని ఆరోపించారు. ఈ సమావేశానికి ఆశగా వచ్చిన వారంతా పెదవి విరిచారన్నారు.

## రేపు లోక్‌సభ ముందుకు అమరావతి చట్టబద్ధత బిల్లు

ఢిల్లీ: పార్లమెంట్ ముందుకు ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు రానుంది. కేంద్ర హోంశాఖ బుధవారం లోక్‌సభలో ఏపీ పునర్విభజన సవరణ చట్టం పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు లోక్‌సభ బిజినెస్ జాబితాలో దీన్ని చేర్చారు. అక్కడ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. రేపు, ఎల్లుండిలోపు ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందనుంది. రాజధాని అమరావతికి చట్టబద్ధతపై ఏపీ ప్రభుత్వం ఈనెల 28న అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన విషయం తెలిసిందే.

# కేంద్ర ఉద్యోగులకు శుభవార్త.. 8వ వేతన సంఘం ఏర్పాటు.. జీతాలు భారీగా పెరిగే ఛాన్స్!

ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన సిఫార్సులను సమర్పించేందుకు 18 నెలల గడువు విధించింది. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల సవరణకు మార్గం సుగమమైంది. కొత్త వేతనాలు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంటులో అధికారికంగా ధృవీకరించారు. 2025 నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు



ఆయన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. జీతాలు, అలవెన్సులు, పెన్షన్ నిర్మాణం వంటి పలు అంశాలపై ఈ కమిషన్ సమీక్షించి, 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన నివేదికను సమర్పిస్తుందని వివరించారు. నివేదిక రావడానికి 2027 మధ్యకాలం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, గత సంప్రదాయం ప్రకారం 2026 జనవరి 1 నుంచే బకాయిలతో సహా కొత్త జీతాలను వర్తింపజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

**ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌దే కీలక పాత్ర**

ఈ వేతన సవరణలో 'ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్' అత్యంత కీలకం కానుంది. ఉద్యోగులందరి మూల వేతనాన్ని (Basic Pay) ఒకేసారి పెంచడానికి ఈ గుణకాన్నే ఉపయోగిస్తారు. 7వ వేతన సంఘం 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను సిఫార్సు చేయగా, దానిని ప్రభుత్వం ఆమోదించింది. దీంతో అప్పుడు కనీస మూల వేతనం రూ. 7,000 నుంచి రూ. 18,000కు పెరిగింది. గరిష్ఠ వేతనం రూ. 2.5 లక్షలకు చేరింది. ఒకవేళ 8వ వేతన సంఘం కూడా ఇదే 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను కొనసాగిస్తే, ప్రస్తుతం రూ. 18,000గా ఉన్న కనీస మూల వేతనం సుమారు రూ. 46,000కు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఉద్యోగుల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మధ్య సమతుల్యం సాధించాల్సి ఉంటుందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. 7వ వేతన సంఘం గడువు 2025 డిసెంబర్ 31తో ముగియడంతో ఈ కొత్త కమిషన్‌ను నియమించారు. మూల వేతనంతో పాటు ఇతర అలవెన్సులు, ప్రస్తుతం 3 శాతంగా ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లు, పెన్షన్ విధానంపైనా ఈ కమిషన్ తన సిఫార్సులను అందించనుంది. కమిషన్ నివేదిక, ప్రభుత్వ ఆమోదం తర్వాతే జీతాలు ఎంతమేర పెరుగుతాయనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.



## బీజేపీలో చేరిన
# టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

భారత టెన్నిస్ దిగ్గజం, ఒలింపిక్ పతక విజేత లియాండర్ పేస్ తన రాజకీయ ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కీలక తరుణంలో పేస్ బీజేపీలో చేరాడు. గతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో ఉన్న పేస్, ఇప్పుడు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ సమక్షంలో లీండర్ పేస్ కాషాయ కండువా కప్పుకున్నాడు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. 1996 ఒలింపిక్స్‌లో పేస్ కాంస్య పతకం సాధించిన చారిత్రక క్షణాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో గాయంతో ఆడుతూ ఆండ్రీ అగస్సీ చేతిలో ఓడిపోయినప్పుడు తానెంతో బాధపడ్డానని చెప్పారు. ఒలింపిక్ పటంలో భారత్‌కు గుర్తింపు తెచ్చిన పేస్, ఇప్పుడు బీజేపీ వేదికగా దేశానికి సేవ చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన అనంతరం లియాండర్ పేస్ భావోద్వేగానికి గురయ్యాడు. "గడిచిన 40 ఏళ్లుగా క్రీడాకారుడిగా దేశం తరపున ఆడాను. డేవిస్ కప్, ఒలింపిక్స్ వంటి ఎన్నో టోర్నీలలో దేశానికి ప్రాతినిధ్యం వహించి గౌరవం తెచ్చాను. ఇప్పుడు నా సోదరులు అప్పగించిన బాధ్యతతో ఒక కొత్త రంగంలోకి అడుగుపెడుతున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా నాయకత్వంలో దేశానికి, ముఖ్యంగా యువతకు సేవ చేయాలనుకుంటున్నాను" అని తెలిపాడు. ఈ అవకాశం కల్పించినందుకు పార్టీ అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశాడు. లియాండర్ పేస్ 2021లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో చేరినప్పటికీ, ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా బీజేపీలో చేరడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. బెంగాల్‌లో టీఎంసీకి గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తున్న బీజేపీకి, పేస్ వంటి ప్రముఖుడి చేరిక కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో పేస్ పోటీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి.

# కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారు

**: రాహుల్ గాంధీ**

కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సీపీఐ(ఎం) వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్ పార్టీ అని విమర్శించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా లెఫ్ట్ పార్టీ నేతలు బీజేపీతో జతకట్టారని అన్నారు. అందుకే కేరళలో ఎల్డీఎఫ్ గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. కన్నూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రతిచోట మతం, దేవుడి గురించి మాట్లాడుతారని, కానీ కేరళలో మాత్రం కనీసం



శబరిమల బంగారం చోరీపై కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. బంగారు తాపడాలు మాయం కావడం వెనుక సీపీఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. సీపీఐతో జతకట్టడం వల్లే బీజేపీ నాయకులు శబరిమల అంశంపై మాట్లాడటం లేదని అన్నారు. బీజేపీతో జతకట్టడం సీపీఐలోని కొంతమంది నాయకులకు ఇష్టం లేదని, అందుకే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. శబరిమల ఆలయంలో బంగారం చోరీకి సంబంధించి సీపీఐ(ఎం) నాయకులపై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఇక్కడి ఎల్డీఎఫ్ మధ్య ఒక అవగాహన ఉందని ఆరోపించారు. కేరళ ముఖ్యమంత్రిని నరేంద్రమోదీ నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేరళ ముఖ్యమంత్రిని జైల్లో పెట్టగలిగే తాళం చెవి మోదీ వద్ద ఉందని, కానీ ఆయన చర్యలు మాత్రం తీసుకోరని అన్నారు.

## మహిళలకు నెలకు రూ.3వేలు..
# అస్సాంలో భాజపా మ్యానిఫెస్టో విడుదల

అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. భాజపా మంగళవారం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)తో పాటు మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తామంటూ పలు హామీలు ప్రకటించింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు విడుదల చేశారు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు..**

* రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్, ఎస్టీ ప్రాంతాలు మినహా.. అస్సాం అంతటా యూసీసీ అమలు
* వరదరహిత రాష్ట్రంగా చర్యలు
* బంగ్లాదేశీ మియాలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం
* అరుణోదయ పథకం కింద మహిళలకు నెలకు రూ.3వేలు అందజేత
* ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగాల కల్పన
* లఖ్‌పతి దీదీ పథకం కింద 40లక్షల మంది మహిళలకు ప్రోత్సాహకాలు






# శీతలా మాతా ఆలయంలో తొక్కిసలాట.. ఎనిమిది మంది మృతి

బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం నలంద జిల్లాలోని శీతలా మాతా ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది భక్తులు మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. నలంద జిల్లాలోని మాఘ్రా గ్రామంలో ఈ ఆలయం ఉంది. చైత్రమాసంలో చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ''ప్రతి మంగళవారం ఇక్కడ రద్దీ నెలకొంటుంది. మేం దర్శనం కోసం పట్నా నుంచి వచ్చాం. కానీ ఉన్నట్టుండి తోపులాట జరగడంతో పలువురు చనిపోయారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది'' అని మమతాదేవి అనే భక్తురాలు మీడియాకు వెల్లడించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయం, ఆసుపత్రి వద్ద విషాదఛాయలు నెలకొన్నాయి. మృతులంతా మహిళలేనని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబాలను అన్నిరకాలుగా ఆదుకుంటామని చెప్పారు.

# యుద్ధాన్ని వాడుకొని లాభాల కోసం.. పీట్ హెగ్సెత్‌పై అనుమానాలు..?

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతోన్న వేళ అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కు సంబంధించి ఓ సంచలన వార్త వినిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ సైనిక చర్య ప్రారంభానికి కొన్నివారాల ముందు హెగ్సెత్ బ్రోకర్ ఒకరు అమెరికా రక్షణ రంగానికి సంబంధించిన కంపెనీల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెలువరించింది. మార్గాన్ స్టాన్లీతో కలిసి పనిచేస్తోన్న ఆ బ్రోకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్లాక్‌రాక్‌ను సంప్రదించినట్లు సమాచారం. బ్లాక్‌రాక్‌కు చెందిన డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ఈటీఎఫ్‌లో మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశాల గురించి ఆ బ్రోకర్ ఆరా తీసినట్లు సదరు కథనం వెల్లడించింది. దీనికి సంబంధించి అంతర్గతంగా చర్చలు నడిచాయని సదరు వర్గాలు పేర్కొన్నట్లు



తెలిపింది. కానీ, ఆ ఈటీఎఫ్‌లను మార్గాన్ స్టాన్లీ ద్వారా కొనుగోలు చేసేందుకు అప్పట్లో అవి అందుబాటులో లేకపోవడంతో ఆ పెట్టుబడుల ప్రక్రియ ముందుకువెళ్లలేదని సమాచారం. ఆ తర్వాత పీట్ హెగ్సెత్ బ్రోకర్ మరో రక్షణరంగ కంపెనీలో పెట్టుబడులు పెట్టారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు. అయితే, యుద్ధానికి కొన్ని వారాల ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడంతో పీట్ హెగ్సెత్ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీట్ చెప్పడం వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి దిగానంటూ అమెరికా అధ్యక్షుడు ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఈ పెట్టుబడుల వార్తల గురించి రక్షణ మంత్రి నుంచి గానీ.. పెంటగాన్ నుంచి గానీ ఎలాంటి స్పందన వెలువడలేదు. బ్లాక్‌రాక్‌కు చెందిన డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ఈక్విటీ ఫండ్ విలువ 3.2 బిలియన్ డాలర్లు. రక్షణ, భద్రతపై ప్రభుత్వం ఖర్చు పెరగడం వల్ల లాభపడే ఏరోస్పేస్, సెక్యూరిటీ టెక్నాలజీ, డిఫెన్స్ కాంట్రాక్టింగ్ వంటి కంపెనీల స్టాక్ పోర్ట్‌ఫోలియోను ఇది నిర్వహిస్తుంది. ఆర్టీఎక్స్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రధాన రక్షణ రంగ కంపెనీలు దీనితో కలిసి పనిచేస్తున్నాయి. తక్కువ ఫీజులు, పన్ను ప్రయోజనాలు వంటి కారణాలతో ఇలాంటి ఈటీఎఫ్‌లకు మదుపర్ల నుంచి మంచి స్పందన లభిస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

# హత్యకేసులో నాలుగేళ్లుగా పరారీ.. చివరకు 'గ్యాస్ బుకింగ్'తో పట్టుబడి

భార్యహత్యకేసులో నాలుగేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఓ ఆర్మీ మాజీ కెప్టెన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ అతడిని పట్టించడం గమనార్హం. సందీప్ తోమర్ అనే ఆర్మీ మాజీ కెప్టెన్.. 2013లో పంజాబ్‌లోని అబోహర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో తన భార్యను హత్య చేశాడు. తొలుత ఆత్మహత్య అని బుకాయించేందుకు యత్నించినా.. విచారణలో ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా తేలింది. ట్రయల్ కోర్టు తోమర్‌ను దోషిగా నిర్ధరించి.. 2014లో జీవిత ఖైదు విధించింది. 2019లో బెయిల్ రావడంతో బయటకు వచ్చాడు. అప్పీల్‌ను 2022లో హైకోర్టు కొట్టివేసినా లొంగిపోలేదు. అప్పటినుంచి ఎప్పటికప్పుడు తన గుర్తింపు, లొకేషన్లు మార్చుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే తోమర్‌ను అరెస్టు చేసేందుకు పంజాబ్ పోలీసులు 'సిట్' ఏర్పాటు చేశారు. తోమర్ పాన్ కార్డుతో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాను పోలీసులు ఇటీవల ట్రేస్ చేశారు. ఆ అకౌంట్ ద్వారా మధ్యప్రదేశ్‌లోని పాంధుర్నాలో ఓ ఎల్పీజీ సిలిండర్ బుక్ చేసినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్‌లో వెల్లడైంది. దీంతో పోలీసులు ఆ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి, డెలివరీ చిరునామాను తీసుకున్నారు. ఆ సమాచారాన్ని స్థానిక పోలీసులకు చేరవేయగా.. వారు అతడిని అరెస్టు చేశారు.

# ఆర్టెమిస్-2 ప్రయోగానికి సర్వం సిద్ధం.. కీలక పరీక్షలకు సిద్ధమైన నాసా

అంతరిక్ష ప్రయోగాల్లో మరో చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమైంది. దశాబ్దాల తర్వాత తొలిసారిగా మానవులను చంద్రుడి వద్దకు పంపేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) చేపట్టిన 'ఆర్టెమిస్2' ప్రయోగానికి తుది సన్నాహాలు పూర్తయ్యాయి. ఏప్రిల్ 1న ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు సుమారు 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి భూమికి రానున్నారు. ఆర్టెమిస్ కార్యక్రమంలో భాగంగా మానవులతో చేపడుతున్న తొలి యాత్ర ఇదే. అపోలో మిషన్ల తర్వాత మనుషులు భూమికి అత్యంత దూరంగా ప్రయాణించడం కూడా ఇదే మొదటిసారి. ఈ బృందంలో నాసా వ్యోమగాములు రీడ్ వైజ్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌తో పాటు కెనడియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన జెరెమీ హాన్సెన్ ఉన్నారు. నాసాకు చెందిన అత్యంత శక్తిమంతమైన స్పేస్ లాంచ్ సిస్టమ్ (SLS) రాకెట్ ద్వారా ఓరియన్ వ్యోమనౌకను నింగిలోకి పంపనున్నారు. ఈ యాత్రలో తొలిసారిగా మానవులతో ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లోని జీవనాధార వ్యవస్థలను (లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్) పరీక్షించనున్నారు. ప్రయోగం రోజున వాతావరణం 80 శాతం అనుకూలంగా ఉంటుందని నాసా అంచనా వేస్తోంది. అయితే, మేఘాలు, గాలుల తీవ్రత సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపింది. ప్రయోగం తర్వాత వ్యోమనౌక భూమి ఎగువ కక్ష్యలోకి చేరి, అక్కడి నుంచి చంద్రుడి వైపు




ప్రయాణిస్తుంది. చంద్రుడి సుదూర ప్రాంతం చుట్టూ తిరిగి, ఎటువంటి అదనపు ఇంధనం అవసరం లేకుండానే భూమికి తిరిగి వచ్చేలా 'ఫ్రీరిటర్న్ ట్రాజెక్టరీ'లో ఈ యాత్రను రూపొందించారు. గతంలో అపోలో 13 మిషన్ నెలకొల్పిన, భూమి నుంచి మానవులు ప్రయాణించిన అత్యంత సుదూర రికార్డును ఈ యాత్ర బద్దలు కొట్టనుంది. ఈ మిషన్‌లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధానాలు, రేడియేషన్ నుంచి రక్షణ, లేజర్ ఆధారిత కమ్యూనికేషన్ టెక్నాలజీలు వంటి కీలక వ్యవస్థలను పరీక్షిస్తారు. భవిష్యత్తులో చంద్రుడిపై శాశ్వత మానవ ఆవాసాలు ఏర్పాటు చేయడం, అంగారకుడిపైకి యాత్రలు చేపట్టడం వంటి లక్ష్యాలకు ఆర్టెమిస్2 ఒక కీలక ముందడుగు అని నాసా వెల్లడించింది. ప్రయోగానికి సంబంధించిన పూర్తి వివరాలను తమ అధికారిక ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపింది.

## ఇండిగో ఎయిర్‌లైన్స్ నూతన సీఈవోగా విల్లీ వాల్ష్..



**న్యూఢిల్లీ:** ఇండిగో ఎయిర్‌లైన్స్ నూతన సీఈవోగా విల్లీ వాల్ష్ నియామకమయ్యారు. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ అధికారికంగా వెల్లడించింది. ఈ సంస్థ సీఈవోగా ఉన్న పీటర్ ఎల్బర్స్ ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త సీఈవో కోసం చూసిన సంస్థ.. విల్లీ వాల్ష్‌ను నియమించుకుంది. విల్లీ వాల్ష్ గతంలో బ్రిటీష్ ఎయిర్‌వేస్, ఐఏజీ సంస్థలకు సీఈవోగా పని చేశారు. ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ)గా వ్యవహరిస్తున్నారు.

ఆయన నియామకంపై ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా స్పందించారు. విల్లీ తమ సంస్థలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎయిర్‌లైన్స్ విభాగంలో ఎన్నో విజయాలు అందుకున్న విల్లీ వాల్ష్ తమ సంస్థకు నాయకత్వం వహించనుండటం ఆనందంగా ఉందన్నారు. అలాగే, ఇండిగోలో తన చేరికపై విల్లీ వాల్ష్ కూడా ప్రకటన చేశారు. ఇండిగో సంస్థను నడిపించబోతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంస్థకు గొప్ప పునాది, గుర్తింపు ఉందని, సంస్థ కోసం బాధ్యతతో పని చేస్తానని తెలిపారు. ఈ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంస్థను నడిపించడానికి కృషి చేస్తానని వెల్లడించారు. ప్రస్తుతం ఐఏటీఏలో పని చేస్తున్న విల్లీ వాల్ష్ ఈ సంస్థలో తన పదవీకాలాన్ని ఈ ఏడాది జూలై 31 వరకు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆగష్టు 3 నుంచి ఆయన ఇండిగో సీఈవోగా బాధ్యతలు స్వీకరిస్తారు. ఇంతకుముందు సీఈవోగా పని చేసిన పీటర్ ఎల్బర్స్ ఇటీవలే రాజీనామా చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇండిగో విమానాలు చాలారోజులపాటు క్యాన్సిల్ అయిన సంగతి తెలిసిందే. దీంతో సంస్థపై చాలా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. నిజానికి ఆయన పదవీ కాలం ఇంకా 18 నెలలు ఉంది.

## కేంద్ర ఉద్యోగులకు శుభవార్త..

**8వ వేతన సంఘం ఏర్పాటు..**

**జీతాలు భారీగా పెరిగే ఛాన్స్!**



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన సిఫార్సులను సమర్పించేందుకు 18 నెలల గడువు విధించింది. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల సవరణకు మార్గం సుగమమైంది. కొత్త వేతనాలు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంటులో అధికారికంగా ధృవీకరించారు. 2025 నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. జీతాలు, అలవెన్సులు, పెన్షన్ నిర్మాణం వంటి పలు అంశాలపై ఈ కమిషన్ సమీక్షించి, 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన నివేదికను సమర్పిస్తుందని వివరించారు. నివేదిక రావడానికి 2027 మధ్యకాలం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, గత సంప్రదాయం ప్రకారం 2026 జనవరి 1 నుంచే బకాయిలతో సహా కొత్త జీతాలను వర్తింపజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

### ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌దే కీలక పాత్ర

ఈ వేతన సవరణలో 'ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్' అత్యంత కీలకం కానుంది. ఉద్యోగులందరి మూల వేతనాన్ని ఒకేసారి పెంచడానికి ఈ గుణకాన్నే ఉపయోగిస్తారు. 7వ వేతన సంఘం 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను సిఫార్సు చేయగా, దానిని ప్రభుత్వం ఆమోదించింది. దీంతో అప్పుడు కనీస మూల వేతనం రూ. 7,000 నుంచి రూ. 18,000కు పెరిగింది. గరిష్ఠ వేతనం రూ. 2.5 లక్షలకు చేరింది.

ఒకవేళ 8వ వేతన సంఘం కూడా ఇదే 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను కొనసాగిస్తే, ప్రస్తుతం రూ. 18,000గా ఉన్న కనీస మూల వేతనం సుమారు రూ. 46,000కు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఉద్యోగుల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మధ్య సమతుల్యం సాధించాల్సి ఉంటుందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.

ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. 7వ వేతన సంఘం గడువు 2025 డిసెంబర్ 31తో ముగియడంతో ఈ కొత్త కమిషన్‌ను నియమించారు. మూల వేతనంతో పాటు ఇతర అలవెన్సులు, ప్రస్తుతం 3 శాతంగా ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లు, పెన్షన్ విధానంపైనా ఈ కమిషన్ తన సిఫార్సులను అందించనుంది. కమిషన్ నివేదిక, ప్రభుత్వ ఆమోదం తర్వాతే జీతాలు ఎంతమేర పెరుగుతాయనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

## హర్మూజ్ జలసంధిలో టోల్ వసూలు..

**కీలక ప్రణాళికకు ఇరాన్ ఆమోదం**



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేసింది. ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలపై టోల్ విధించడంతో పాటు అమెరికా, ఇజ్రాయెల్ నౌకలను నిషేధించడం వంటి అంశాలతో కూడిన 'హర్మూజ్ జలసంధి నిర్వహణ ప్రణాళిక'కు ఇరాన్ పార్లమెంట్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం తెలిపింది.

ఈ కొత్త ప్రణాళిక ప్రకారం హర్మూజ్ జలసంధిలో భద్రతా ఏర్పాట్లు, నౌకల భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికపరమైన అంశాలపై ఇరాన్ దృష్టి సారించనుంది. ముఖ్యంగా ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ కరెన్సీ 'రియాల్' రూపంలో టోల్ వసూలు చేయనున్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాన్‌పై ఏకపక్ష ఆంక్షలు విధిస్తున్న దేశాల నౌకలను కూడా ఈ జలసంధిలోకి అనుమతించబోమని ప్రణాళికలో స్పష్టంగా పేర్కొన్నారు. జలసంధిపై ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, సాయుధ బలగాల పాత్రను బలోపేతం చేయడం, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో ఒమన్‌తో సహకరించడం వంటివి కూడా ఈ ప్రణాళికలో భాగమని ఐఆర్ఐబీ నివేదిక తెలిపింది.

# కూపర్ కనోలీ సూపర్ షో..

**గుజరాత్‌పై పంజాబ్ థ్రిల్లింగ్ విక్టరీ**




ఛండీఘర్: ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 3 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని అందుకుంది. 163 పరుగుల లక్ష్య ఛేదనలో పంజాబ్ మిడిల్ ఆర్డర్ కుప్పకూలినా, యువ ఆటగాడు కూపర్ కనోలీ (44 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. కీలక సమయంలో జేవియర్ బార్ట్‌లెట్ (5 బంతుల్లో 11 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో మరో 5 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసింది. శుభ్‌మన్ గిల్ (39), జోస్ బట్లర్ (38) రాణించడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశ్యాఖ్ 3 వికెట్లతో సత్తా చాటగా, యజువేంద్ర చాహల్ 2 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్‌కు ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37; 4 సిక్సర్లు) మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే అతను ఔటయ్యాక పంజాబ్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా తడబడింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. 118 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో పాతుకుపోయిన కూపర్ కనోలీ, గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు, సిక్సర్లు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఆఖరి ఓవర్లలో మ్యాచ్ తీవ్ర ఉత్కంఠను రేపింది. చివర్లో మార్కో యాన్సెన్ (9) ఔటవ్వడంతో పంజాబ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే కనోలీకి జత కలిసిన బార్ట్‌లెట్ ఒక సిక్సర్ బాది సమీకరణాన్ని సులభతరం చేశాడు. దీంతో పంజాబ్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఈ సీజన్‌లో తమ తొలి విజయాన్ని ఘనంగా నమోదు చేసింది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 3 వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. కనోలీ అసాధారణ పోరాట పటిమతో పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

**టీ20 లీగ్‌లో బాల్ ట్యాంపరింగ్..**

## పాకిస్థాన్ క్రికెటర్‌పై నిషేధం..!



**ఇస్లామాబాద్:** స్వదేశంలో జరగుతున్న టీ20 లీగ్‌లో బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన పాకిస్థాన్ ఆటగాడు ఫఖర్ జమాన్‌పై నిషేధం పడింది. పాకిస్థాన్ సూపర్ లీగ్ నియమావళిని ఉల్లంఘించిన అతడు రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని మంగళవారం ఆ దేశ క్రికెట్ బోర్డు వెల్లడించింది. బంతి ఆకృతిని మార్చేందుకు ప్రయత్నించిన ఫఖర్ ఆర్టికల్ 2.14ను అతిక్రమించాడు. దాంతో, అతడిపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది పాక్ బోర్డు.

అసలేం జరిగిందంటే.. పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్‌లో లాహోర్ క్యాలండర్స్ జట్టుకు ఫఖర్ జమాన్ ఆడుతున్నాడు. మార్చి 29న కరాచీ కింగ్స్‌తో మ్యాచ్ సమయంలో అతడు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన అంపైర్లు లాహోర్ జట్టుకు 5 పరుగుల జరిమానా విధించడంతో పాటు కొత్త బంతిని తీసుకున్నారు. ఫఖర్ తీరును తప్పుబట్టిన అంపైర్లు షాహిద్ సైకత్, ఫైజల్ ఖాన్ అఫ్రీది.. టీవీ అంపైర్ అసిఫ్ యాకూబ్, ఫోర్త్ అంపైర్ తారీక్ రషీద్‌లు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు.

అయితే.. ఫఖర్ మాత్రం తాను ఏ తప్పు చేయలేదని బుకాయించాడు. దాంతో, అతడిపై క్రమశిక్షణ కమిటీ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అతడు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన ఆధారాలు చూపించిన అంపైర్లు.. రెండు మ్యాచ్‌ల నిషేధం విధించారు. దాంతో, ఏప్రిల్ 3న ముల్తాన్ సుల్తాన్స్, ఏప్రిల్ 9న ఇస్లామాబాద్ యునైటెడ్ మ్యాచ్‌లకు ఈ స్టార్ బ్యాటర్ దూరం కానున్నాడు.

**బీజేపీలో చేరిన**

## టెన్నిస్ లెజెండ్ లియాండర్ పేస్



**న్యూఢిల్లీ:** భారతీయ టెన్నిస్ క్రీడాకారుడు, లెజెండరీ ప్లేయర్ లియాండర్ పేస్ సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆ పార్టీ సీనియర్ నేతలు, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు సమక్షంలో లియాండర్ పార్టీలో చేరారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పేస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కోల్‌కతాలో పేస్ కలిశారు.దీంతో టెన్నిస్ స్టార్ బీజేపీలో చేరుతారన్న ఊహాగానాలు వినిపించాయి. 2021లో లియాండర్ పేస్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2022 గోవా ఎన్నికల్లో అతను ఆ పార్టీ తరపున ప్రచారం నిర్వహించాడు. కానీ పేస్ ఆ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీపడలేదు. బీజేపీలో చేరిన తర్వాత పేస్ మాట్లాడారు. తన జీవితంలోని 40 ఏళ్ల పాటు దేశానికి ఆడానని, అనేక టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించానని, డేవిస్ కప్, ఒలింపిక్స్‌లో ఆడి తనకు, తన కుటుంబానికి, దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇప్పుడు కొత్త ఫీల్డ్‌లోకి ఎంటర్ అవుతున్నానని, తన సోదరులు తనకు బాధ్యతను అప్పగించారని, ఈ దేశానికి, యువతకు సేవ చేయాలని ఉందన్నారు. ప్రజాసేవ బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీ, మంత్రి అమిత్ షా, నతిన్ నబిన్‌లకు ఆయన థ్యాంక్స్ చెప్పారు.

# ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టులకు బ్రేక్..

**గంగూలీ రియాక్షన్ ఇదే..!**



**కోల్‌కతా:** భారత్‌లో టెస్టు మ్యాచ్‌లకు కొన్ని మైదానాలు కేరాఫ్. ప్రతి సిరీస్‌లో కచ్చితంగా ఆయా స్టేడియాల్లో మ్యాచ్‌లు ఉండేలా భారత క్రికెట్ నియంత్రణ మండలి షెడ్యూల్ ప్రకటిస్తుంది. ఈ లెక్కన కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మ్యాచ్ ఉండి తీరుతుంది. అయితే.. ఈసారి 2026-27 షెడ్యూల్‌లో ఈడెన్‌ను కాదని మిగతా వేదికలకు మ్యాచ్‌లు కేటాయించింది బీసీసీఐ. దాంతో, ఈ విషయంపై రగడ మొదలైంది. అయితే.. ఈ అంశంపై బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ మాత్రం సానుకూలంగా స్పందించాడు.

టెస్టు క్రికెట్‌ను మరిన్ని మైదానాలకు విస్తరించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే 2026-27 సీజన్‌లో భారత జట్టు ఐదు టెస్టులు ఆడనుంది. ఆశ్చర్యంగా వాంఖడే స్టేడియం(ముంబై), ఈడెన్ గార్డెన్స్(కోల్‌కతా)లు మాత్రం వేదికలుగా ఎంపికవ్వలేదు. దాంతో, ఘన చరిత్ర కలిగిన ఈ రెండు మైదానాల్లో మ్యాచ్‌లు ఆడించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. టెస్టు మ్యాచ్‌లను మిగతా వేదికల్లో జరపడం శుభపరిణామం అని క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ అన్నాడు.

'ఈడెన్ గార్డెన్స్‌లో పెద్ద టెస్ట్ మ్యాచ్‌లు జరగడం గొప్పగా అనిపిస్తుంది. మాజీ ఆటగాడిగా, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఈ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించడానికి ప్రయత్నిస్తా. అయితే.. దక్షిణాఫ్రికాతో టెస్టు మ్యాచ్, ఆపై టీ20 ప్రపంచకప్, ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌లు ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతున్నాయి. ఈడెన్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడించాలని నేను అనుకుంటాను. కానీ, అదే సమయంలో ఇతర మైదానాల్లో కూడా మ్యాచ్‌లు జరగాలిగా' అని గంగూలీ పేర్కొన్నాడు. వచ్చే ఏడాది ఆరంభంలో బోర్డర్ -- గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియా ఐదు టెస్టులు ఆడనున్నాయి. జనవరి 21 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ మ్యాచ్‌లను నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు.

MOVIE TIME




# కథనార్‌తో మళ్లీ బలమైన పాత్రలో అనుష్క

## ట్రైలర్ విడుదల చేసిన చిత్రబృందం

**టాకీస్:** టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి 'బాహుబలి' తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'కథనార్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా విడుదలైన 'కథనార్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. 'కథనార్'తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# 2న రామాయణ టీజర్ విడుదల



బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బ్జడెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్ రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు. ఇప్పటివరకు చిత్రబృందం కేవలం టైటిల్ వీడియోతో పాటు 3 నిమిషాల 3 సెకన్ల నిడివి గల 'రామాయణ: ది ఇంట్రడక్షన్' అనే క్లిప్‌ను మాత్రమే పంచుకుంది. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో కూడిన ఆ వీడియోలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యష్ లుక్‌లకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను చూపించారు.అయితే ఇప్పుడు రాబోతున్న టీజర్ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ దృశ్యకావ్యం 2026 నవంబర్‌లో దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# యూట్యూబ్‌లో ధురంధర్-2

## ఫిర్యాదుతో తొలగించిన నిర్వాహకులు


**టాకీస్:** బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ధురంధర్ 2' పైరసీ ఉచ్చులో చిక్కుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో



దూసుకుపోతున్న ఈ చిత్రం.. యూట్యూబ్‌లో లీక్ కావడం కలకలం రేపుతుంది. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా నడుస్తున్న ఈ సినిమా పూర్తి నిడివి గల పైరేటెడ్ వెర్షన్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేశారు. దీంతో మొబైల్ ద్వారా రికార్డ్ చేసిన దాదాపు 4 గంటల నిడివి గల ఈ వీడియోను అప్పటికే వేలాది మంది నెటిజన్లు వీక్షించారు. అయితే ఈ పైరసీ అప్‌లోడ్‌ను గమనించిన అభిమానులు వెంటనే సోషల్ మీడియా వేదికగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ట్యాగ్ చేస్తూ అలర్ట్ చేశారు. ఇక అభిమానుల నుంచి వచ్చిన సమాచారంతో చిత్రబృందం తక్షణమే రంగంలోకి దిగి, యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా.. ఆ పైరేటెడ్ లింక్‌ను విజయవంతంగా డిలీట్ చేసింది యూట్యూబ్. మరోవైపు ఈ పైరసీ అడ్డంకులు వలన సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం జోరు తగ్గలేదు. కేవలం రెండు వారాల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1400 కోట్ల మైలురాయికి చేరువలో ఉంది. ఇప్పటికే నార్త్ అమెరికాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచి 'బాహుబలి 2' రికార్డులను సైతం అధిగమించింది.

# ఓటీటీలోకి రాధిక తాయ్ కిళవి మూవీ

**టాకీస్:** సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించి, సంచలన విజయం సాధించిన తమిళ చిత్రం 'తాయ్ కిళవి'. ఈ చిత్రం తాజాగా డిజిటల్ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.75



కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. ఏప్రిల్ 10 నుంచి ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్' తో పాటు సింప్లీ సౌత్ అనే ఓటీటీలో ఒకేసారి స్ట్రీమింగ్ కాబోతున్నాయి. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం డిజిటల్ ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుంది. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామాను ప్రముఖ తమిళ హీరో శివకార్తికేయన్ తన సొంత నిర్మాణ సంస్థ 'శివకార్తికేయన్ ప్రొడక్షన్స్' పతాకంపై నిర్మించారు. 63 ఏళ్ల వయసులో రాధిక దాదాపు 5 గంటల పాటు ప్రోస్థటిక్ మేకప్ వేసుకుని మరీ పవునుత్తాయి అనే వృద్ధురాలి పాత్రలో అద్భుతమైన నటనను కనబరిచారు. ఈ సినిమా కథవిషయానికి వస్తే.. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథలో పవునుత్తాయి (రాధికా శరత్‌కుమార్) ఒక కఠినమైన వడ్డీ వ్యాపారి. అయితే ఊహించని విధంగా ఆమె పక్షవాతానికి గురై మంచాన పడుతుంది. ఆమె వద్ద 160 తులాల బంగారం ఉందనే వార్త తెలుసుకున్న ఆమె ముగ్గురు కొడుకులు వేర్వేరు ప్రాంతాల నుంచి హుటాహుటిన ఊరికి చేరుకుంటారు.





# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ

**టాకీస్:** ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# విమర్శలను పట్టించుకోవడం మానేశా

## నిర్మాత కొణిదెల నిహారిక



**టాకీస్:** తాను ఏం చేసినా కొందరు విమర్శిస్తూనే ఉన్నారని, అందుకే అలాంటివారిని పట్టించుకోవడం మానేసినట్లు నిర్మాత నిహారిక చెప్పారు. ఆమె సొంత బ్యానర్‌పై వస్తోన్న చిత్రం 'రాకాస' సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మానస శర్మ దర్శకురాలు. ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీమ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అందులో నిహారిక మాట్లాడుతూ.. నిర్మాతగా కెరీర్ ప్రారంభించగానే ఎన్నో విమర్శలు ఎదురయ్యాయని అన్నారు. కమిటీ కుర్రోళ్లుతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశాను. అప్పుడు చాలామంది కామెంట్స్ చేశారు. ఎందుకు చేస్తున్నావు ఇదంతా.. తెలిసిన వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' చేస్తుంటే 'కమిటీ కుర్రోళ్లు' లాంటి కథలు చేయచ్చు కదా.. ఇలాంటి వీఎఫ్ఎక్స్‌లు ఎందుకు అన్నారు. చిన్నచిన్న వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అని మరికొందరు అన్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను. నిర్మాతగా ప్రతి సినిమా నుంచి నేర్చుకుంటూనే ఉన్నాను. కొణిదెల కుటుంబం నాకు ఎంత ముఖ్యమో నా బ్యానర్ పింక్ ఎలిఫెంట్ ఫ్యామిలీ కూడా అంతే ముఖ్యం అని నిహారిక అన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.